ప్రభుత్వానికి పునాదులు వలంటీర్లు

- అవినీతిరహితంగా ప్రభుత్వ పథకాల అమలు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాల ప్రదానం

పెనమలూరు: ప్రభుత్వానికి పునాదులు వలంటీర్లు అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గోసాల, పెనమలూరు గ్రామాల్లో మంగళవారం జరిగిన వలంటీర్ల ప్రోత్సాహక పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. తాను గడపగడపకు కార్యక్రమంలో పర్యటించిన సమయంలో వలంటీర్లకు ప్రజల్లో ఉన్న ఆదరణ స్పష్టంగా కనబడిందన్నారు. వలంటీర్ల వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రతి నెలా వేకువ జామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేయటమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలు చేసిన ఘనత ప్రభుత్వంతో పాటు వలంటీర్లకే దక్కిందన్నారు. వలంటీర్ల సేవలు గుర్తించిన ప్రభుత్వం వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలకు రూ.245 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా వలంటీర్లు కృషి చేయాలని, పార్టీ నేతలు, కార్యకర్తలు వలంటీర్లకు అండగా నిలుస్తారని అన్నారు. ఎంతో ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థను టీడీపీ నేతలు కించపరుస్తున్నారని అన్నారు.


గోసాలలో వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

194 మంది వలంటీర్లకు పురస్కారాలు

మండల పరిధిలోని ఆరు గ్రామాలలో ఉన్న 239 క్లస్టర్లలో 194 మంది వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 187 మందికి సేవా మిత్ర పురస్కారాలు లభించాయి. గంగూరు 2 సచివాలయంకు చెందిన వడ్డాది నాగలక్ష్మి, చావా సునీత సేవా వజ్ర పురస్కారాలు పొందారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, సర్పంచిలు సంగెపు శ్రీనివాసరావు, లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, గుంటూరు శ్రీనివాసచౌదరి, వైఎస్సార్ సీపీ నేతలు అక్బర్‌పాషా, గద్దల రాజా, వేమూరి రాజా, వల్లే నరసింహారావు, పోలవరపు రవి, బంగారు నాగేంద్రబాబు, ఎండి.దాదా పాల్గొన్నారు.

పారదర్శకంగా పనిచేస్తే గుర్తింపు

ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: పారదర్శకంగా పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ సరోజిని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారథులుగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా వలంటీర్లు పని చేయాలని ఎంపీపీ కోరారు. మండలంలో ఇందుపల్లి, ఆత్కూరు, ఆముదాలపల్లి గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆత్కూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. అనంతరం ఆత్కూరులో 25 మందికి, ఆముదాలపల్లిలో 19 మందికి, ఇందుపల్లిలో 17 మంది వలంటీర్లకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందుపల్లిలో సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఆముదాలపల్లిలో సర్పంచ్ డి.వెంకటరమణ, ఆత్కూరులో ఎస్తేరమ్మ వలంటీర్లకు అవార్డులు అందజేసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు సత్యసాయిబాబు, ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆత్కూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ సరోజిని

వలంటీర్ల సేవలకు పురస్కారాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రోత్సహించేందుకు ఏటా 'వలంటీర్లకు వందనం' పేరుతో ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలకు బాపులపాడు మండలంలో 415 మంది ఎంపికయ్యారు. గన్నవరం నియోజకవర్గ స్థాయిలో 'సేవా వజ్ర' అవార్డుకు బాపులపాడు–3 సచివాలయానికి చెందిన గెద్దల జోసఫ్, వేలేరు గ్రామ సచివాలయానికి చెందిన వీర్ల దుర్గ ఎంపికయ్యారు. వీరికి రూ.30 వేలు నగదు బహుమతి, మెడల్, బ్యాడ్జి, శాలువా, సర్టిఫికేట్‌తో సత్కరించనున్నారు. మండల స్థాయిలో అందించే 'సేవా రత్న' అవార్డుకు మరడాని లావణ్య (ఆరుగొలను), బేతాళ ప్రభావతి (బండారుగూడెం), చిన్నం వంశీ (బొమ్ములూరు), ఎనికేపల్లి శుభ భావన (శేరినరసన్నపాలెం), బొల్లెద్దు చాముండేశ్వరి (వీరవల్లి–1)లకు ఎంపికయ్యారు. వీరికి రూ.20 వేలు నగదు బహుమతితో పాటుగా మెడల్, బ్యాడ్జి, శాలువా, సర్టిఫికెట్లతో సత్కరించనున్నారు. మరో 408 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారంతో రూ.10 వేలు నగదు బహుమతిని అందజేయనున్నారు.


గెద్దల జోసఫ్


వీర్ల దుర్గ

చెరువులో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు చెరువులో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, సేకరించిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ 247 బ్లాక్‌లో వనర్చే కుమార్, మార్త దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు సంతానం. కుమార్ రైళ్లలో పర్సులు, ఇయర్ ఫోన్స్ విక్రయిస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం కుమార్ ఆఖరి సంతానమైన నయోమి(4) తోటి వారితో ఆడుకుంటూ కాలనీలోని హెల్త్ సెంటర్ వెనుక వైపు ఉన్న చెరువు వద్దకు వెళ్లింది. ప్రమాదశాత్తు చెరువులోకి నయోమి పడిపోవడంతో ఆ చిన్నారితో పాటు వచ్చిన మరో బాలుడు పరుగు పరుగున ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. కుమార్ కుటుంబంతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి పాపను రక్షించేందుకు తీవ్ర యత్నం చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పాప మృతదేహాన్ని చెరువులో గుర్తించారు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు చెరువు వద్దకు చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాప కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


నయోమి మృతదేహం

భర్త మృతిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్యంతో ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందడంపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటకు చెందిన పైడిపాటి సీతారత్నం, నాగేశ్వరరావు భార్యభర్తలు. నాగేశ్వరరావు బైండింగ్ పని చేస్తుంటాడు. నాగేశ్వరరావుకు మద్యం తాగే అలవాటు ఉంది. కొద్ది రోజులుగా నాగేశ్వరరావుకు జ్వరంగా ఉండటంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. జ్వరం కారణంగా బాగా నీరసంగా ఉంటున్న నాగేశ్వరరావును మంగళవారం మధ్యాహ్నం కొత్తపేటలోని షేక్ రాజా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొనడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రికి చేరేసరికే నాగేశ్వరరావు మృతి చెందడంతో మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

● ఎండమావులు


ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మంగళవారం ఉదయం ఎండ తీవ్రతకు రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డులో కనిపించిన ఎండమావులను సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ఏకాగ్రతే విజయానికి తొలిమెట్టు



కంకిపాడు: ఏకాగ్రతే విజయానికి తొలి మెట్టు అని వక్తలు అన్నారు. మండలంలోని కంకిపాడు, తెన్నేరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. తెన్నేరు గ్రంథాలయంలో కథలు చదివించటం, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఎ.శ్రీకాంత్ పర్యవేక్షించారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ

శారీరక దారుఢ్యానికి క్రీడలు అవసరం



గన్నవరం రూరల్: క్రీడలు విద్యార్థుల శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం క్రీడా మైదానంలో విద్యార్థులచే క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలలను వేసవిలో టీవీలు, సెల్‌ఫోన్‌లకు దగ్గర కాకుండా ప్రభుత్వం ఈ క్యాంపును అమలు చేయటంతో ఎంతో మేలు జరిగిందని చెప్పారు. గ్రంథాలయం పాఠకులు పాల్గొన్నారు.

సుమాంజలికి ఏయూ డాక్టరేట్



గన్నవరం రూరల్: విజయవాడకు చెందిన అవనిగడ్డ సుమాంజలికి ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్‌ను అందజేసింది. కెమికల్ ఇంజినీరింగ్ బయోటెక్నాలజీ విభాగంలో చేసిన పరిశోధనలకు ఈ డాక్టరేట్ ప్రకటించారు. ఆమె బయోటెక్నాలజీలో ఎంటెక్ పూర్తి చేసి అనంతరం అదే యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. 'స్టడీస్ ఆన్‌ది ఎఫెక్ట్ ఆఫ్ క్లోరో పైరిఫాస్, మాలాథియాన్ ఆన్ సాయిల్ మైక్రో బయో డైవర్సిటీ అండ్ బయో రెమిడేషన్ యూజింగ్ ద ఐసోలేటెండ్ బ్యాక్టీరియా కేసీఎం-08 బేసిలస్ సేఫెన్సిస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించినట్లు సుమాంజలి మంగళవారం తెలిపారు. ఆచార్య వంగలపాటి మీనా పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేయగా ఆంధ్రా యూనివర్శిటీ డెప్యూటీ రిజిస్ట్రార్ అకడమిక్ కె.ఉమామహేశ్వరి ఈ మేరకు ఆదేశాలిచ్చారు. డాక్టరేట్ సాధించిన సుమాంజలిని పలువురు అభినందించారు. ఆమె తల్లి పద్మావతి ఉపాధ్యాయినిగా, తండ్రి పున్నారావు సామాజిక వేత్తగా సేవలందిస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గన్నవరం: విమానాశ్రయ భద్రతా సిబ్బంది విధి నిర్వాహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంకెవీఎన్.గుప్తా సూచించారు. స్థానిక విమానాశ్రయంలో మంగళవారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ డాక్టర్ కేఎన్.రావు ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన షైన్ హాస్పిటల్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీఎఫ్‌కు చెందిన 161 మంది అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ...ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతినెల వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల సిబ్బంది విధి నిర్వహణలో ఒత్తిళ్లను గురికాకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉంటారని తెలిపారు. ఎస్పీఎఫ్ సీఐలు కె.అరుముగమ్, కె.మస్తాన్, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డ్రైన్‌లపై ఆక్రమణలు తొలగించాలి

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో డ్రైన్‌లపై ఉన్న ఆక్రమణలను ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని తాడిగడప మునిసిపాలటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో తాడిగడప, కానూరు, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో చాలా మంది డ్రైన్‌లను ఆక్రమించి నిర్మాణాలు కట్టారని, తోపుడు బళ్లు, పాకలు, షెడ్డులు వేశారని అన్నారు. దీనివలన డ్రైన్‌లలో పూడిక తీత పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి డ్రైన్‌ల పూడిక తీత పనులు చేయాల్సి ఉందన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. లేని పక్షంలో మునిసిపాలిటీ ఆక్రమణలు తొలగిస్తుందని అన్నారు.

వైఎస్సార్ సీపీ నేతను పరామర్శించిన ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బుర్ల వేణును ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మంగళవారం పరామర్శించారు. వేణుకు కొద్ది రోజుల క్రితం గుండె ఆపరేషన్ చేశారు.ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి పోరంకిలో వేణు స్వగృహానికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ముదునూరు సచివాలయం తనిఖీ చేసిన అధికారులు

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు సచివాలయాన్ని డీఎల్‌డీఓ నాంచారరావు, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ మంగళవారం సందర్శించారు. కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి రహదారుల అభివృద్ధిపై సర్వే చేశారు. ఆధార్ క్యాంపును తనిఖీ చేశారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెడు వ్యసనాలకు బానిసై, అధిక కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన గోగులమూడి జగదీష్‌కు ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన నాగజ్యోతితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్నాళ్లు సాఫీగా సాగిన వీరి సంసారంలో కొంత కాలంగా గొడవలు మొదలయ్యాయి. దుర్వ్యసనాలకు బానిసగా మారిన జగదీష్ అక్రమ సంబంధాలు పెట్టుకుని భార్య నాగజ్యోతిని శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 22వ తేదీన నాగజ్యోతిని కర్రతో తీవ్రంగా కొడుతుండగా, అడ్డుకోబోయిన ఆమె తల్లిదండ్రులను కూడా జగదీష్ కొట్టాడని చెప్పారు. దీంతో తీవ్ర గాయాలపాలైన నాగజ్యోతి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కాలేయ మార్పిడికి సాయం అందించరూ...


సీఎం కార్యాలయం ఇచ్చిన సీఎంఆర్ఎఫ్ లేఖను చూపుతున్న రాజేష్, అతని కుటుంబ సభ్యులు

కంకిపాడు: లివరు సంబంధ అనారోగ్యం ఆ కుటుంబాన్ని అష్టకష్టాలపాలు చేసింది. వైద్యులు లివరు మార్పిడి చేయాలని చెప్పటంతో వారి గుండెల్లో రాయి పడినట్లయ్యింది. శస్త్రచికిత్సకు రూ.22 లక్షలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ కింద రూ.10 లక్షలు ఇచ్చేందుకు అనుమతి లేఖను పొందారు. మిగిలిన సొమ్ము కోసం దాతల సాయం అర్థిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన ముప్పిరి రాజేష్ (35) కారు డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. భార్య అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. ముగ్గురు పిల్లలు సంతానం. రాజేష్ గ్రామంలోనే తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత ఏడాది డిసెంబరులో రాజేష్‌కు నోటి వెంట రక్తం పడటంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. పరీక్షలు చేసిన వైద్యులు లివరు పూర్తిగా దెబ్బతిందని తేల్చారు. లివరు మార్పిడి చేయాలని సూచించటంతో మణిపాల్ ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించాడు. ఆరోగ్య శ్రీ వర్తించదని, శస్త్రచికిత్సకు రూ.22 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. రాజేష్ సోదరి చేదుర్తిపాటి వాణి తన లివరును దానమిచ్చేందుకు ముందుకొచ్చింది. వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి లివరు మార్పిడికి అనువుగా ఉన్నట్లు తేల్చారు.

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు

ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వైద్యులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం ప్రత్యేక ప్రతినిధి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలుపుతూ సంబంధిత లేఖను ఆసుపత్రి వైద్యులకు సిఫారసు చేస్తూ పంపారు. దీంతో ఆ కుటుంబానికి కొండంత అండ లభించినట్లయ్యింది. శస్త్రచికిత్సకు అవసరమైన మిగిలిన రూ.12 లక్షల కోసం రాజేష్ కుటుంబం దాతల సాయం కోసం అర్థిస్తోంది. దాతలు ముందుకొచ్చి శస్త్రచికిత్సకు సాయం అందించాలని రాజేష్ కుటుంబం చెమ్మగిల్లిన కళ్లతో వేడుకుంటోంది. ఫోన్ పే, గూగుల్ పే నంబరు : 6303539569, ఎస్‌బీఐ కంకిపాడు బ్రాంచి, బ్యాంకు ఖాతా నంబరు : 20115095564, IFSC Code : SBIN0001410

ప్రమాదాల నియంత్రణకు పరిశీలన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పా రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు మంగళవారం పోలీసు, ట్రాఫిక్, నేషనల్ హైవే, ట్రాన్స్‌పోర్టు ఉన్నతాధికారులు జాతీయ రహదారిపై పలు ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై చర్చించారు. ఏసీపీలు సురేష్ రెడ్డి, భాస్కరరావు, పటమట సీఐ కాశీవిశ్వనాథ్, ట్రాఫిక్ సీఐ బాల మురళి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు నుంచి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి తదితరులు జాతీయరహదారిపై పలు ప్రదేశాలను పరిశీలించారు. ప్రమాద నివారణ చర్యలపై చర్చించారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో ఎడమ వైపు వాల్ ఎత్తుగా ఉండటం వల్ల కుడి వైపు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించారు. ఈ స్లోప్‌ను సమాంతరంగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కరెన్సీనగర్ సర్వీసు రోడ్డులో బైలైన్స్ వల్ల ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం ఉన్నందున క్లోజ్ చేయాలని నిర్ణయించారు. ఇన్నోటల్ ఆపోజిట్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏపుగా పెరిగిన మొక్కలను శుభ్రపరచాలని, రామవరప్పాడు రింగ్‌లోని 'ఐ లవ్ విజయవాడ' వద్ద ఉన్న రింగ్ పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడి రహదారి వైశాల్యం తగ్గి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించారు. పంచాయతీ తీర్మానంతో చుట్టూ ఉన్న రింగ్ పరిమాణాన్ని తగ్గించాలని నిర్ణయానికి వచ్చారు. ఈ చర్య వల్ల రహదారి వెడల్పు పెరుగుతుందని తద్వారా ట్రాఫిక్ సాఫీగా సాగుతుందని తెలిపారు. గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.


ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

పాడి రైతుల అభ్యున్నతికి ప్రోత్సాహకాలు

గన్నవరం: పాడి రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని బోనస్‌లు, ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని దావాజిగూడెం పాల సేకరణ కేంద్రంలో మంగళవారం 'పాడి రైతుల సంక్షేమం మన మతం–అలుపెరగని సేవ మన అభిమతం' కార్యక్రమంలో భాగంగా సొసైటీ పాలకవర్గం, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ.. రైతులకు అత్యధికంగా పాలసేకరణ ధరను చెల్లిస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం యూనియన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చలసానిని సత్కారించారు. యూనియన్ డైరెక్టర్ పాలడుగు నాని, సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర, రూట్ మేనేజర్ కోట ప్రసాద్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


చలసానిని సత్కరిస్తున్న సొసైటీ పాలకవర్గ సభ్యులు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...గ్రామంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన జొన్న సాంబశివరావు (63) ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పంట బోదె తవ్వకం పనులు పూర్తయిన అనంతరం గట్టుపై కూర్చుని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కూలీలు సాంబశివరావును హుటాహుటిన ఆసుపత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందాడు. ఏపీడీ నాంచారరావు, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ ఉపాధి కూలీ సాంబశివరావు భౌతిక కాయాన్ని సందర్శించారు. సాంబశివరావు మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు.


ఉపాధి కూలీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఉపాధి కూలీల సంక్షేమమే లక్ష్యం

గన్నవరం రూరల్: ఉపాధి కార్మికుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. మంగళవారం కొండపావులూరు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు జెడ్పీటీసీ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అందని వారు తెలియజేయాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఉపయోగపడే విధంగా పంట కాలువలు తవ్వకం, చెరువుల్లో పూడిక తీత చేస్తున్న అధికారుల కృషిని ప్రశంసించారు. ఉదయం 11గంటలకు మరోసారి వేలి ముద్రలు వేయాలన్న ఉపాధి పథకం అధికారుల నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆమెకు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. పని ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరతామని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ కూచిపూడి రమేష్, మేట్లు పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు వారి సిబ్బందితో కలిసి నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో వివిధ అసాంఘిక కార్యకలాపాల నివారణకు మంగళవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కొంత మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే వాహన తనిఖీలో సరైన రికార్డులు లేని వారిని, అధిక చలానాలు ఉన్న వాహనాలను గుర్తించి చలాన్లు విధించారు. సోమవారం రాత్రి నగరంలోని వివిధ ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న, న్యూసెన్స్ చేస్తున్న 72 మందిపై, మోటార్ వాహన చట్టం ఉల్లంఘించిన వారిపై 935 కేసులు నమోదు చేశారు.

భవానీపురం పీఎస్‌లో సమావేశం

దిశ ఏసీపీ వీవీ నాయుడు ఆధ్వర్యంలో భవానీపురం పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అదే విధంగా పోక్సో చట్టం, డయల్ 100, 112, దిశ యాప్ వలన కలిగే ప్రయోజనాలను చెప్పారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రజలకు ఏ విధంగా తెలియచేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు.


భవానీపురం పీఎస్‌లో మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న దిశ ఏసీపీ నాయుడు